అంబర్‌పేట్‌లో నేడు కేటీఆర్ పాదయాత్ర

సికింద్రాబాద్, మార్చి 29 : సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి తీగుల్ల పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ఆదివారం సాయంత్రం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర చేపట్టనున్నట్లు పద్మారావు కార్యాలయ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా శనివారం సాయంత్రం అంబర్‌పేట్, పటేల్‌నగర్‌లో పాదయాత్ర వాయిదా పడింది. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో పటేల్‌నగర్‌లో ఈ ప్రచార కార్యక్రమం జరుగనున్నది. అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తోపాటు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు హాజరవుతున్నందున కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నియోజకవర్గ నాయకులు కోరారు.

ఇంజినీరింగ్ అధికారులకు సన్మానం

కంటోన్మెంట్, మార్చి 30 : కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో శనివారం పదవీ విరమణ పొందిన ఇంజినీరింగ్ అధికారులు గోపాలకృష్ణ దాస్, బాలకృష్ణను శనివారం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, వ్యాపారవేత్త రాఘవరెడ్డి ఘనంగా సన్మానించారు. గోపాలకృష్ణ దాస్, బాలకృష్ణ అనేక సంవత్సరాలుగా ఇంజినీరింగ్ విభాగంలో విశిష్ట సేవలందించారని ప్రతాప్ పేర్కొన్నారు. అసిస్టెంట్ ఇంజినీర్లుగా నియమితులైన వారు సీనియర్ అధికారులను ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని ఆయన సూచించారు. పదవీ విరమణ తర్వాత వారు సమాజానికి తమ వంతుగా సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, శంకరయ్య, విఠల్‌రెడ్డి, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో గులాబీ జెండా ఎగరాలి

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్

- మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో గజ్జెల నాగేశ్ భేటీ

కంటోన్మెంట్, మార్చి 30 : కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగుర వేసేందుకు నాయకులు, కార్యకర్తలు కష్టపడాలని మల్కాజిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం న్యూ బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ ఉప ఎన్నికపై ఇరువురు నేతలు సుధీర్ఘంగా చర్చించారు. దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత ప్రమాదవశాత్తు మరణించిన నేపథ్యంలో ఉప ఎన్నికలు రావడంతో పార్టీ అధిష్టానం ఎవరికి టికెట్ కేటాయించినా వారిని గెలిపించుకునేలా పని చేయాలని పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఆభాసు పాలయ్యాయని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం గజ్జెల నాగేశ్ మాట్లాడుతూ ఈ సారి ఎన్నికల్లో ఉద్యమకారులకు అవకాశం కల్పించే విధంగా పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. తెలంగాణ ఉద్యమం నాటి నుంచి పార్టీ జెండా మోస్తున్నామని, ఉప ఎన్నికల్లో తమకు టికెట్ కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలిచి పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బహుమతిగా ఇస్తానన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్‌కు కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి అత్యధిక ఓట్లు వేసేలా కష్టపడతామన్నారు.

లోకసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలం చూపిస్తాం..

- అవకాశవాదులు, స్వార్థపరులు వెళితే పార్టీకి ఏలాంటి నష్టం లేదు..
- బీఆర్ఎస్ నగర సంయుక్త కార్యదర్శి గుండవేణి రాజేశ్‌గౌడ్

అడ్డగుట్ట, మార్చి 30 : ఊసరవెల్లిలా రంగులు మార్చినట్లు సీజన్‌కో పార్టీ మారే నాయకులు పార్టీలో ఉన్నా.. వెళ్లినా..ఒకటేనని బీఆర్ఎస్ పార్టీ నగర సంయుక్త కార్యదర్శి గుండవేణి రాజేశ్‌గౌడ్(పెద్దన్న) శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదేళ్లు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పదవులు, అధికారాన్ని అనుభవించి పార్టీ అధికారానికి దూరం కాగానే కండువాలు మార్చుతున్న వలస నేతలపై ఆయన తీవ్రంగా మండిపడ్డాడు.

బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా.. లేకున్నా.. ప్రజలకు ఎల్లప్పుడూ దగ్గరగానే ఉంటుందని తెలిపారు. స్వార్థపరులు, అవకాశవాదులు మధ్యలో వచ్చిన నాయకులు మధ్యలోనే వెళుతున్నారని, వారితో పార్టీకి నష్టం జరగదని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని, పోరాటపటిమ పార్టీ పుట్టుకలోనే ఉందని ఆయన వివరించారు. బీఆర్ఎస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉందని, మాజీ సీఎం కేసీఆర్ వెంటే తెలంగాణ ప్రజలంతా ఉన్నారని తెలియజేశారు. అదే పనిగా పార్టీలు మారే నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన తెలిపారు. రాజకీయంలో గెలుపోటములు సర్వసాధారణమని, లోక్‌సభ ఎన్నికల్లో గులాబీ బలం ఏమిటో చూపిస్తామని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ఎన్నో ఒడిదుడుకులను, ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడిం దని, అలాంటి పార్టీపై ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా వృథాయేనని ఆయన స్పష్టం చేశారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

హిమాయత్‌నగర్,మార్చి 30: మనువాదుల నుంచి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్ల మూరి కృష్ణ స్వరూప్ అన్నారు. సూర్యపేట జిల్లాకు చెందిన టీజేఏసీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వేమిరెడ్డి లక్ష్మి రాజీనామా చేసి డీబీపీలో చేరారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కృష్ణ స్వరూప్.. ఆమెను పార్టీలోకి ఆహ్వానించి.. మహిళా ఉపాధ్యక్షురాలిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. రాష్ట్రంలో సమాజిక, సమానత్వం, మానవ హక్కుల కోసం రాజకీయ పరంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని పిలుపు నిచ్చా రు. కార్యక్రమంలో పార్టీ హుజూర్‌నగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి విజయ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ గణేశ్, శంబిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

పాపపరిహారకుడు ఏసుక్రీస్తు

- 'రన్ ఫర్ జీసస్'లో పాల్గొన్న క్రైస్తవ ప్రతినిధులు

సమావేశంలో మాట్లాడుతున్న కార్డినల్ బిషప్ పూల ఆంథోని

మారేడ్‌పల్లి, మార్చి 30: గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండుగల నేపథ్యంలో గత 15 సంవత్సరాలుగా ప్రతిష్టాత్మకంగా క్రిస్టియన్ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో ఫెడరేషన్ తెలుగు చర్చెస్, అన్ని డినామినేషన్, ఇండిపెండెంట్ చర్చిల సహకారంతో ఆరాధన టీవీ 'రన్ ఫర్ జీసస్' ర్యాలీ నిర్వహిస్తున్నది. శనివారం సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీ బసలికా చర్చిలో రోమన్ క్యాథలిక్ చర్చి కార్డినల్ బిషప్ పూల ఆంథోని జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతున్న ఏసు ప్రభువు మానవాళి పాప పరిహారం, శాప వినిమోచన కోసం మానవుడిగా జన్మించి తన 33వ ఏట ప్రాణత్యాగం చేసిన రోజున గుడ్ ఫైడే జరుపుకుంటారని అన్నారు. ఈస్టర్ రోజున పునరుత్థానం చెంది ఏసు సమాధి నుంచి సజీవుడిగా లేచాడని, ఆయా సందర్భాల్లో ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులంతా వేడుకలు జరుపుకుంటారని పాల్ దేవప్రియం తెలిపారు సెయింట్ మేరీ బసిలికా చర్చి, ప్యాట్నీ, ట్యాంక్‌బండ్ మీదుగా ఆబిడ్స్ సెయింట్ జార్జియస్ స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్న క్రైస్తవులు

ర్యాలీలో మెథడిస్ట్ బిషప్ ఎంఏ డానియల్, థెరిస్సా పాల్, ఉషా పాల్, రెవరెండ్ మోహన్‌బాబు, డాక్టర్ చిరంజీవి, బిషప్ విల్సన్ సింగం, రాజ ఎబేల్, దీపక్‌జాన్, జేరుసలేం మత్తయ్య, పాస్టర్లు. యువత, వేలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

- మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

బీఆర్ఎస్ మోండా డివిజన్ నాయకులతో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

కంటోన్మెంట్/మారేడ్‌పల్లి, మార్చి 30: బీఆర్ఎస్ పార్టీ బోయిన్‌పల్లి కార్యాలయంలో శనివారం ఆ పార్టీ మోండా డివిజన్ నాయకులు, కార్యకర్తలతో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సమావేశమయ్యారు. రానున్న మల్కాజ్‌గిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలపై నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే చర్చించారు. బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మాజీ కోఆప్షన్ సభ్యుడు సీఎన్ నర్సింహముదిరాజ్, అశోక్ ముదిరాజ్, జోడి బ్రదర్స్, సానాధి శ్రీనివాస్, క్రిస్టోఫర్, సందీప్, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ కాలనీలో నివేదిత పర్యటన



గాంధీకాలనీ వాసులతో బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత, నళినీకిరణ్, తదితరులు

మారేడ్‌పల్లి, మార్చి 30: కంటోన్మెంట్ నాలుగో వార్డు గాంధీ కాలనీలో శనివారం బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత, బోర్డు మాజీ సభ్యురాలు నళినికిరణ్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మహిళలంతా నివేదితకు సంపూర్ణ మద్దతు పలికారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న, లాస్యనందిత సేవలను గుర్తు చేసుకున్నారు. ఎల్లవేళలా ప్రజలకు అండగా ఉండే సాయన్న కుటుంబానికి తాము అండగా ఉంటామని పేర్కొన్నారు. సంతోష్, ఆనంద్, మహేశ్, గణేశ్, సురేఖ,యాకుబ్, ఇస్మాయిల్, విజయలక్ష్మి, మనీషా,చందు, అమర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

బండ్లగూడ,మార్చి 30: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించాలని రాజేంద్ర నగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా రానున్న ఎన్నికల్లో ఓటర్ల శాతం పెంచేందుకు స్వీప్ నోడల్ అధికారి బి.శరత్‌చంద్ర ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్‌లో వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులతోపాటు పలు కళాశాలల విద్యార్థులతో ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ..5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్,మోహ్మా రంగారెడ్డి జిల్లా అధికారి జ్ఞానేశ్వర్, శ్రీలత, తాసీల్దార్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌లో 'గాంధీ' విద్యార్థుల ప్రతిభ

బన్సీలాల్‌పేట్, మార్చి 30 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచడం అభినందనీయమని గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. రమేశ్‌రెడ్డి అన్నారు. కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో మార్చి 24 నుంచి 29 వరకు ఇంటర్ కాలేజెస్ మహిళల స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. మెడికల్, డెంటల్, హోమియో, ఫిజియో, యునానీ, ఆయుశ్‌కు చెందిన 78 వైద్య కళాశాలల నుంచి 700 మంది విద్యార్థులు మీట్‌లో పాల్గొన్నారు. బాస్కెట్‌బాల్, లాన్ టెన్నిస్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో సికింద్రాబాద్ గాంధీ వైద్యకళాశాల విద్యార్థులు విజయం సాధించి, ఓవరాల్ విజేతలుగా నిలిచారు. శనివారం కళాశాలకు వచ్చిన విజేతలు చరిత, అపూర్వరెడ్డి, శ్రావ్య, స్వేచ్ఛ రెడ్డి, జాహ్నవి,శృతి, సంతోషి, అవిక, వైష్ణవి, రిషిక, హరిణిశ్రీ, సంజోత్య, సంజనా, వర్షదీప్తి, చిన్మయిలను ప్రిన్సిపాల్, రమేశ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కృష్ణమోహన్, ఫిజికల్ డైరెక్టర్ వేణు అభినందించారు.

అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, మార్చి 30 : అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే ప్లాట్‌ఫామ్ నంబర్-2, 3 మధ్య ఉన్న ఎక్స్‌లేటర్ పక్కనే గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి వయసు సూమారు 55-60 ఏండ్ల మధ్య ఉంటుందని, అనారోగ్యంతో మృతి చెందిఉండవచ్చునని పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధీకులు సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు

- ట్రాఫిక్ డీసీపీ సుబ్బరాయుడు
- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిసరాల్లో అధికారులతో కలిసి ట్రాఫిక్ పర్యవేక్షణ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో అధికారులతో కలిసి ట్రాఫిక్‌ను పర్యవేక్షించిన ట్రాఫిక్ డీసీపీ సుబ్బరాయుడు, అదనపు డీసీపీ రంగారావు, తదితరులు

మారేడ్‌పల్లి,మార్చి 30: నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ డీసీపీ సుబ్బరాయుడు తెలిపారు. శనివారం ట్రాఫిక్ అదనపు డీసీపీ రంగారావు, ఏసీపీ శంకర్‌రాజు, ఇన్‌స్పెక్టర్లు రాములు, శంకర్, ఆర్పీసీ అసిస్టెంట్ మేనేజర్ విజయకుమార్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సరస్వత్‌తో కలిసి ట్రాఫిక్ డీసీపీ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ రద్దీ నివారణకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు. రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రైల్వే స్టేషన్ ఔట్ గేటు వద్ద ఆర్టీసీ బస్సులు ముందు వచ్చి మలుపు తీసుకోకుండా చూడాలని అన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు, సెట్విన్ డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ పరిసరాల్లో రోడ్లు, పుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తమకు కేటాయించిన స్థలాల్లో మాత్రమే వ్యాపారాలు చేసుకోవాలని యజమానులకు సూచించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లోపల ప్రయాణికులను తీసుకొని వచ్చే వాహనాలను త్వరగా బయటకు పంపించేలా రైల్వే పోలీసులు చూసుకోవాలన్నారు.

హుండీ లెక్కింపు..

అమీర్‌పేట్, మార్చి 30 : బల్కంపేట ఎల్లమ్మ దేవాలయ హుండీ లెక్కింపు శనివారం జరిగింది. నలభై రోజులకుగాను ఆలయంలోని సాధారణ, అన్నదాన హుండీల ద్వారా రూ. 40.01 లక్షలు, ఇ-హుండీ ద్వారా 3.45 లక్షల ఆదాయం సమకూరింది. అందులో యూఎస్ డాలర్లు 56, కనెడా డాలర్లు 7, యూకే పౌండ్లు 20, ఆస్ట్రేలియా డాలర్లు 5, మలేషియా రింగిట్ 1, ఖతర్ రియాల్స్ 5 ఉన్నాయి. దేవాదాయ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీదేవి పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపులో ఆలయ ఈవో కుంట నాగరాజు, చైర్మన్ కొత్తపల్లి సాయిగౌడ్, పాలక మండలి సభ్యులు ఎ.ప్రభుగౌడ్, ఎ.సురేశ్‌గౌడ్, కూతురు నర్సింహ, దాసోజు పుష్పలత తోపాటు ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు పట్టం.. 'కామిక్ కాన్ 2024'

అమీర్‌పేట్, మార్చి 30 : అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జరిగిన 'కామిక్ కాన్ 2024' విద్యార్థుల సృజనాత్మకత, సహకారం, సాంస్కృతిక మార్పిడికి దోహదం చేసింది. అవినాష్ విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ అవినాష్ బ్రహ్మదేవర నేతృత్వంలో కొనసాగిన ఈ ఈవెంట్‌లో హైదరాబాద్, పరిసర ప్రాంతాలకు చెందిన 40కి పైగా ఇంటర్, డిగ్రీ కళాశాలలకు చెందిన సుమారు వెయ్యిమంది విద్యార్థులు పాల్గొని కామిక్స్, యానిమేషన్, వీడియో గేమ్‌ల్లో పాత్రలను విశదీకరించడం, ఊహాత్మకమైన దుస్తుల ద్వారా తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. ఆకర్షణీయమైన కార్యక్రమాలు, ఫుడ్, టెక్నికల్ స్టాల్స్‌తో పాటు, ఆటపాటలతో విద్యార్థుల్లో స్నేహభావం పెంపొందించాయి. కార్యక్రమంలో అవినాష్ విద్యాసంస్థల డీన్ డాక్టర్ సుశీల కందూరి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎస్ఎన్ సావిత్రిదేవి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి

హిమాయత్‌నగర్, మార్చి 30: లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీలుగా పోటీ చేస్తున్న ముదిరాజ్ సామాజిక వర్గం అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలుపించుకోవాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ పిలుపు నిచ్చారు. శనివా రం నారాయణగూడలో మహాసభ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగిం ది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీలుగా ముదిరాజ్ అభ్యర్థులు గెలిస్తే దేశ సమస్యలు, రాష్ట్ర అభివృద్ధి, ముదిరాజ్‌ల సమస్య లను పరిష్కారానికిపాటుపడే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత 44 ఏండ్ల తరువాత ముగ్గురు అభ్యర్థులకు అవకాశం లభించిందని, బీఆర్ఎస్ పార్టీ నుంచి చేవెళ్ల ఎంపీగా కాసాని జ్ఞానేశ్వర్, బీజేపీ నుంచి మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్, కాంగ్రెస్ నుంచి మెదక్ ఎంపీగా నీలం మధు పోటీలో ఉన్నారని తెలి పారు. ఇంతకాలం ఇతర కులాల అభ్యర్థులకు ఓట్లువేసి గెలిపిం చామని పార్టీలు, సంఘాలకు అతీతంగా ముగ్గురు ముదిరాజ్ అభ్య ర్థులను గెలిపించుకునేందుకు కలిసికట్టుగా ముందుకు సాగాలని ముదిరాజ్ కులస్తులకు పిలుపునిచ్చారు. సమావేశంలో మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు శైలేంద్ర శివయ్య, మద్దెల సంతోష్, కరుణాకర్‌ముదిరాజ్, అంజయ్య, బైరి శంకర్, రాష్ట్ర కోశాధికారి బైండ్ల సత్యనారాయణ, గోపిరాజ్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యమే కొంపముంచింది..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతికి కారణమైన ముగ్గురు అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని

కంటోన్మెంట్, మార్చి 30 : బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతికి కారణమైన ఐదుగురిలో ముగ్గురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈనెల 24న డైరీ ఫామ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆకాశ్, నందిని మృతి చెందిన విషయం తెలిసిందే. రోడ్డు నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపైనా కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని వెల్లడించారు.

శనివారం బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్ జోన్ ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు, అడిషనల్ డీసీపీ రంగారావు, బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డితో కలిసి డీసీపీ వివరాలు వెల్లడించారు. భారత్ ఫైబర్ నెట్ కేబుల్ రహదారిపైన పడి ఉండటంతో ద్విచక్ర వాహనదారుడు ప్రమాదానికి గురయ్యాడని, సాయంచేద్దామని కొంతమంది యువకులు అక్కడ ఆగడంతో అదే సమయంలో భారీ ట్రక్కు ఆ యువకులను ఢీకొట్టడంతో ఆకాష్‌తో పాటు నందిని అక్కడికక్కడే మృతి చెందారని తెలిపారు. సరియైన వెలుతురు లేక ప్రమాదం జరిగిందన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా భారత్ ఫైబర్ నెట్ వారు ఇంటర్నెట్ కేబుల్ వేయడంతో ప్రమాదం సంభవించిందన్నారు. అదే ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కూడా జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రయాణికులు ఈ ప్రమాదాన్ని గుర్తించలేకపోయారని చెప్పారు.

లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందని, ప్రమాదం జరుగుతుందని తెలిసి కూడా లారీ నడిపి ఇద్దరి ప్రాణాలు బలిగొన్న లారీ డ్రైవర్‌తో పాటు లారీకి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో లారీ యజమానిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఈ క్రమంలో ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను తప్పించి మరొక డ్రైవర్‌ను ఏర్పాటు చేసిన ట్రక్కు ఓనర్‌పైన కేసు నమోదు చేశామని డీసీపీ తెలిపారు. దీంతో పాటు భారత్ ఫైబర్ నెట్ ఎండీ రాఘవేంద్ర రవికిరణ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణ సంస్థ దారులు, జెట్ మేనేజర్ కె.రాఘవేంద్ర, భారత్ ఫైబర్ నెట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గడ్డం పూర్ణచందర్, లారీ యజమాని అర్జున్ సింగ్(43)లను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు పేర్కొన్నారు. లక్ష్మీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వేములపల్లి రవికిరణ్‌తో పాటు లారీ డ్రైవర్ ఉర్జిషేక్‌లో పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.

వచ్చే నెల 3న మాదిగల సింహగర్జన

మాట్లాడుతున్న మాదిగ సంఘాల నేతలు

కంటోన్మెంట్, మార్చి 30 : కంటోన్మెంట్‌లో వచ్చే నెల 3న మాదిగల సింహగర్జన సభ నిర్వహిస్తున్నట్లు మాదిగ సంఘాల నేతలు ఇటుక శ్రీ కిషన్ మాదిగ, శారద, మల్లేశ్ పేర్కొన్నారు. శనివారం కంటోన్మెంట్ పరిధిలోని డైమండ్ పాయింట్ చౌరస్తాలోని ఓ హోటల్‌లో మాదిగ సంఘాల నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మాదిగలను రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయని విమర్శించారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో మెజార్టీశాతం మాల సామాజిక వర్గ నేతలకే అవకాశం కల్పించారని గుర్తు చేశారు. ఈసారి బీజేపీ, కాంగ్రెస్‌తో పాటు అన్ని పార్టీలు మాదిగలకే టిక్కెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కంటోన్మెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా 50 వేల మందికిపైగా ఉన్న మాదిగలు తమ సత్తా చూపుతారని అన్నారు. అవసరమైతే మాదిగ వర్గానికి చెందిన నేతనే స్వతంత్ర అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించుకుంటామన్నారు. 3న మాదిగల సింహగర్జన సభ నిర్వహిస్తామని త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.